క్లుప్తంగా

6 నుంచి ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శన

చిత్తూరు రూరల్: శివరాత్రి పురస్కరించుకుని ఏర్పాటు చేస్తున్న ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శనను విజయవంతం చేయాలని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ నిర్వాహకులు వసుధ, జ్యోతి, రాజశేఖర్ కోరారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నగరంలోని సాంబయ్యకండ్రిగ ప్రాంతంలోని ఓం శాంతి యోగ భవనంలో ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శన ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రదర్శనను ప్రజలు తిలకించాలని వారు కోరారు.

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం 35- యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థికి నివాళి


మౌనీష్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న సునీల్‌కుమార్, నాయకులు

బంగారుపాళెం: మహాబలిపురం బీచ్‌లో గల్లంతై మృతి చెందిన విద్యార్థికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ నివాళులర్పించారు. ఆయన సోమవారం సాయంత్రం బంగారుపాళెం మండలం కేసీ కండ్రిగ గ్రామానికి చేరుకుని విద్యార్థి మౌనీష్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. విద్యార్థుల మృతి బాధాకరమన్నారు.

పూర్వ విద్యార్థి వితరణ



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని వీకే పల్లెకు చెందిన విజయకుమార్ తన ఉన్నతికి బాటలు వేసిన పులిచెర్ల హైస్కూలుకు రెండేసి చొప్పున కంప్యూటర్లు, ప్రింటర్లు, ఒక వాటర్‌ఫిల్టర్, మూడు రూటర్లు, మూడు ఐరన్ ర్యాకులు, 15 డెస్కులను వితరణ చేశారు. వీటి విలువ రూ.2.80లక్షలు. అలాగే ప్రార్థనా సమావేశ హాలుకు రూ.2 లక్షలు, స్థానిక విశ్రాంత ఉపాధ్యాయురాలు రూ.50 వేలు అందజేశారు.ప్రస్తుతం విజయకుమార్ హుబ్లీలో కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. పాఠశాలలోని విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, కెనరా బ్యాంకు డివిజనల్ మేనేజర్ శరవణ, కల్లూరు కెనరా బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ ,పాఠశాల హెచ్‌ఎం సయ్యద్ సాహెబ్ వల్లీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ హామీలు నమ్మొద్దు


చిత్తూరులో ఇంటింటా ప్రచారం చేస్తున్న విజయానందరెడ్డి


గుడిపాల: ప్రచారం చేస్తున్న విజయానందరెడ్డి

- వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ప్రజలకు మాయమాటలు చెప్పి ఎలాగైనా అధికారంలో రావాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని, టీడీపీ, జనసేన పార్టీల హామీలను నమ్మరాదని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక సత్యనారాయణపురం డివిజన్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఆయనకు డివిజన్‌లో ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో దుష్టశక్తులు కూటమిగా చేరి తప్పుడు ప్రచారానికి తెర తీశాయన్నారు. గతంలో పలు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ ఆ తర్వాత వాటిని అటకెక్కించిందని విమర్శించారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలను జగనన్న అధికారంలోకి రాగానే నెరవేర్చారని, అంతేకాకుండా ప్రకటించని పథకాలను సైతం ఇస్తున్నారని గుర్తు చేశారు. అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఆధార్ వివరాలు ఇవ్వొద్దు

ఎన్నికల సమయంలో టీడీపీ ఇంటింటి సర్వే చేస్తూ, ఓటర్ల ఆధార్, ఓటర్.. ఇలా వ్యక్తిగత వివరాలను సేకరిస్తోందన్నారు. అందరి అకౌంట్‌లో డబ్బులు వేస్తామని మాయమాటలు చెబుతోందన్నారు. వారికి ఎవరూ వ్యక్తిగత, ఇతరత్రా సమాచారం ఇస్తే దుర్వినియోగం చేస్తారని, ఓట్లను కూడా గల్లంతు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మభ్యపెట్టి సమాచారం కోసం ఎవరైనా వస్తే పోలీసులకు తెలియజేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి నాయకులు రూపేష్‌రెడ్డి, వెంకటేశు, గోపి, నాగరాజు, బాలసుబ్రమణ్యం, మోహన్, బబీ, రవి పాల్గొన్నారు.

జోరుగా కమ్మతిమ్మాపల్లెలో ప్రచారం

గుడిపాల: రాబోవు ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి పట్టం కడితే అభివృద్ధిని మరింత జోరుగా పరుగులు తీయిస్తామని చిత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. సోమవారం కమ్మతిమ్మాపల్లె పంచాయతీలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ, దేశంలో ఏ ముఖ్యమంత్రీ అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకెళ్లారన్నారు. ఎన్నికల హామీలను 99 శాతం నెరవేర్చి, పేదల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చేసిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. ఎన్ని జెండాలు జత కట్టినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని జోస్యం చెప్పారు. తాను గ్రామాల్లో పర్యటిస్తుంటే.. ఆడపడుచులు అందరూ జగనన్నకు అండగా ఉంటామని చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ జనార్దన్, ఎంపీటీసీలు గోళ్ల హరిప్రసాద్, రవి, యోవాన్, చిట్టిబాబు, డానియల్, బాబు, సర్పంచులు మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్‌రాయల్, సంపూర్ణమ్మ, మోహన్‌నాయుడు, నవీన్, వైఎస్సార్ సీపీ నాయకులు శిలంబరసన్, రఘు, క్రిష్ణ, ప్రకాష్, కలైఅరసి, ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు అగ్రికల్చర్: ఓటుహక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్ తులసి కోరారు. ఓటు హక్కుపై సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా సమాఖ్య భవనం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవడంతోపాటు ఎన్నికల సమయంలో విధిగా ఓటు వేసేలా సంఘ సభ్యులు కృషి చేయాలన్నారు. ఓటు ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలస వెళ్లిన వారు కూడా ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంలు వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్ ఇంక్రిమెంట్ ఉత్తర్వులు అమలు చేయరూ!

- డీఈఓకు ఎస్టీయూ నేతల వినతి


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నేతలు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు ప్రభుత్వం జారీచేసిన ఇంక్రిమెంట్ ఉత్తర్వులు అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి డీఈఓ దేవరాజును కోరారు. సోమవారం ఆయన అసోసియేషన్ నేతలతో కలిసి డీఈఓకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడారు. హైస్కూల్ ప్లస్ టీచర్లకు ఒక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఆ ఉత్తర్వులను అమలు చేసే దిశగా చర్యలు తీసుకుని హెచ్‌ఎంలకు ఉత్తర్వులను పంపాలని కోరారు. దీనిపై డీఈఓ స్పందిస్తూ, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఎంతో మంది గ్రామీణ విద్యార్థులు ఇంటర్మీడియెట్ చదువుతున్నారని, హైస్కూల్ ప్లస్ విధానం విజయవంతం అయ్యేందుకు అందులో పనిచేస్తున్న టీచర్లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు దామోదర్ రెడ్డి, మహేష్, గుణశేఖరన్ పాల్గొన్నారు.

కుప్పం రెస్కో ఉద్యోగ నియామకాలపై విచారణ చేయాలి

చిత్తూరు కలెక్టరేట్: కుప్పం రెస్కోలో ఉద్యోగ నియామకాలపై కలెక్టర్ విచారణ చేయించాలని సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఈ ఆ పార్టీ నాయకులు ఆందోళన చేసి స్పందనలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, కుప్పం రెస్కో సంస్థలో ఉద్యోగ విరమణ చేసిన స్థానంలో పాలకవర్గం నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేసిందని ఆరోపించారు. సీనియారిటీ ఉన్న వారిని ఎండీగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

పూతలపట్టు: ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్టు సీఐ ప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తలుపులపల్లి సమీపంలోని పొలంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందిందన్నారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని దాడి చేసినట్టు తెలిపారు. ఆరుగురిని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రతి ఒక్కరికీ వైద్యం


తవణంపల్లె: రోగులకు రక్తపోటు పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది


గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రష్మిత

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రతి ఒక్కరికీ వైద్యం అందిస్తున్నామని మండల వైద్యాధికారులు ప్రియాంక, పవన్‌కుమార్ తెలిపారు. వారు సోమవారం మల్లకుంట, పుణ్యసముద్రంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వేర్వేరుగా వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు.

కమ్మతిమ్మాపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తున్నామని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. సోమవారం కమ్మతిమ్మాపల్లెలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు, అలాగే బీపీ, షుగర్ ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి ఇళ్లకే వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. సలహాలు–సూచనలు ఇచ్చారు. వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, సరిత, శిల్ప, కిరణ్‌కుమారి పాల్గొన్నారు.


మల్లకుంటలో వృద్ధులకు రక్తపోటు పరీక్ష చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్

నేడు నలగాంపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

బంగారుపాళెం: మండలంలోని నలగాంపల్లెలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తుంబకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్‌వెంగల్‌రాయన్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాణిపాక ఆలయం పుష్ప శోభితం


విశేషాలంకరణలో సుపథ మండపం


ఆలయం ముందు స్వాగత తోరణాలు


సుగంధ పుష్పాల అలంకరణలో ధ్వజ స్తంభం

కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం పుష్పసోయగాన్ని సంతరించుకుంది. ఆలయంలో ఆదివారం మంత్రులు, అధికారులు పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలోని సుపథ మండపం, స్వామివారి ధ్వజస్తంభం, అంత్రాలయంలో విశేషంగా అలంకరించారు.

'స్పందన' వినతులు పరిష్కరించండి

- కమిషనర్ అరుణ


అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: స్పందన కార్యక్రమంలో అందే వినతలను సకాలంలో పరిష్కరించాలని నగర కమిషనర్ అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. ఇంజనీరింగ్-2 , ప్రజారోగ్య విభాగం-1 , టౌన్ ప్లానింగ్- 2 చొప్పున వినతులు అందాయి. కార్యక్రమంలో మున్సిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ లోకేష్, ఆర్వో గోపాలకృష్ణ వర్మ, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చిత్తూరు అర్బన్: రానున్న వేసవిలో నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని మేయర్ ఎస్. అముద అధికారులను ఆదేశించారు. నగరంలో తాగునీటి సమస్యలను ఎదుర్కోవడానికి మేయర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేస్తూ కమిషనర్ జె అరుణ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఈ కమిటీ ఏర్పాటైంది. మేయర్ అధ్యక్షులుగా, మెంబర్ కన్వీనర్‌గా ఎంఈ గోమతి, సభ్యులుగా డిప్యూటీ మేయర్లు ఆర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు షర్మిల ప్యారీ, జ్ఞాన జగదీష్, నవీన్ కుమార్‌లను కమిటీలో నియమించారు. నగరపాలక పరిధిలో తాగునీటి సమస్య నెలకొన్న 11 వార్డుల పరిధిలో పరిశీలించి కొత్త బోర్ల తవ్వకం, మెరుగైన నీటి సరఫరా అంశాలపై చర్యలు తీసుకోవాలని, ఎన్టీఆర్ జలాశయం నుంచి సరఫరాను పర్యవేక్షించాలని, లీకేజీ లేకుండా చూడాలని, కొండపై నివసించే వారికోసం సింథటిక్ ట్యాంకులను ఏర్పాటు చేసే అంశంపై పరిశీలించాలని అముద ఆదేశించారు. తాగునీటి సరఫరాకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే సత్వర పరిష్కారానికి కమిటీ చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సమావేశంలో డీఈ వెంకట ప్రసాద్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోలో ప్రతి ఒక్కరినీ గుర్తించండి


పోలియో చుక్కలు వేస్తున్న జార్జ్

గుడిపాల: పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్క బిడ్డనూ గుర్తించి పోలియో నిరోధక చుక్కలు వేయాలని వైద్య ఆరోగ్యశాఖ స్టాటిస్టికల్ అధికారి జార్జ్ అన్నారు. సోమవారం వసంతాపురంలో ఇంటింటా సందర్శన కార్యక్రమం నిర్వహించారు. పోలియో చుక్కలు వేయలేదని గుర్తించిన చిన్నారులను గుర్తించి చుక్కలు వేశారు. జార్జ్‌తోపాటు డాక్టర్ చంద్రమహేష్, సిబ్బంది విజయ, చంద్ర, జబ్బా పాల్గొన్నారు.

మొగిలి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం


విద్యుత్ దీపాలతో అలంకరించిన శివాలయం

బంగారుపాళెం: మొగిలి శివాలయంలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న శ్రీమొగిలీశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఆలయానికి వెల్ల వేశారు. భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్లు వేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టినట్టు ఆలయ ఈవో మునిరాజు తెలిపారు.

నేడు అంకురార్పణ

మొగిలి బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఉదయం కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపడతారు. రాత్రి మూషిక వాహనంపై వినాయక ఉత్సవాన్ని నిర్వహించనున్నారు.

కోడెగిత్తల హుషారు

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పంలో సోమవారం ఎద్ల పందేలు అట్టహాసంగా సాగాయి. ఉదయం గ్రామదేవత సత్యమ్మకు ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అనంతరం దేవర ఎద్దులను గ్రామంలో ఊరేగించారు. పరుగులు తీస్తున్న పోట్ల గిత్తలను నిలువరించి వాటికి కట్టిఉన్న పలకలను దక్కించుకోవడానికి యువకులు పోటీ పడ్డారు. పట్టుకునేందుకు యువకులు ఆసక్తి చూపారు.


కోడెగిత్తను నిలువరిస్తున్న యువకులు


పశువుల పరుగు పందెంను మిద్దెలపై నుంచి తిలకిస్తున్న ప్రజలు


పరుగులు తీస్తున్న కోడెగిత్త

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ


విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేస్తున్న ఎంఈఓ

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె ఆదర్శ పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు సోమవారం విశ్రాంత ఉపాధ్యాయుడు శివయ్య ప్లేట్లు పంపిణీ చేశారు. ఎంఈఓ సాయిలీల మాట్లాడుతూ, ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద విద్యార్థులకు భోజనం చేసేందుకు ప్లేట్లు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.